

# గొంతు విప్పిన స్వరం

దినకర్

ఫోన్ అదేపనిగా మోగసాగింది.

విశాలమైన హాలులో ఖరీదైన మఖమల్ కవర్లు కప్పిన సోఫాకుర్చీల మధ్య అందమైన టీపాయ్‌మీద అత్యాధునికమైన టెలిఫోన్!

భవనం లంకంతది. మేడమీదికి వెళ్ళేందుకు రెండువైపులా మెట్లు. చూచేవారికి చప్పున ఏదో హిందీ సినిమాలో ఓ జమీందార్ భవంతి గుర్తుకువచ్చేలా కనిపించే భవనస్వరూపం.

ఓ పదినిమిషాలు విరామంలో ఆగబోయేముందుగా ఓ నడిమివయసాయన ఏదో గదిలోనుండి వచ్చి ఫోనందుకున్నాడు.

"ఆ... యు! ఆ! అలాగే. లైన్లోనే ఉండండి! అయ్యగారిని పిలుస్తాను." అంటూ ఫోన్ కిందగాపెట్టి మెట్లకానుకొనున్న ఓ అందమైన గదిలోకిపోయి రెండు నిమిషాల్లో బయటికి వచ్చి ఫోను దగ్గరగావచ్చి నిలబడ్డాడు.

మరోనిమిషంలో ఆ గదిలోంచి పర్వతరావు వచ్చాడు. ఆద్యంతాలు వర్ణించవలసిన పనిలేని బడా రాజకీయ నాయకుని వేషంలో వున్నాడు. అయినా

రెండుమూడు విశేషణాలు పర్వతరావుని గురించి చెప్పక తప్పదు.

ఆజానుబాహువు, అందుకుతగ్గ పసిమి శరీరం! గుబురుగా మెలితిరిగిన మీసాలు. గంభీరంగా అనుపించే చూపులు. వంద మందిలో వున్నా పర్వతరావు అని గుర్తు పట్టేయగల రాయన్ని: వేపిన ఉడుపులూ, తొడిగిన వైనం, చేతుల వ్రేళ్ళకి ఉంగ రాలూ, గడియారమూ చాలు చాలా ధన వంతుడని చెపుతాయి.

సింహంలా నడచి వచ్చి, సోఫాలో గంభీరమైన రాచఠీవిలో కాలుమీద కాలు వేసుక్కూచోని టీపాయ్‌మీంచి ఫోనందు కున్నాడు.

అవతలనుంచి వస్తున్నదేమో తెలీదు క్షణక్షణానికీ ముఖభంగిమలు మారిపో తున్నాయి పర్వతరావుకి. చివరి భంగిమ విసుక్కూ, కోపానికీ, అసహనానికి ప్రతిబింబంలా కనబడింది.

"ఇప్పుడే వస్తున్నాను" అంటూ ఫోను పెట్టేశాడు. అందులో విసురుంది!

"రంగనాథం! కారు రెడీచేయమని డ్రైవరికి చెప్పు. నాష్టాచేసి వస్తాను" అంటూ తీవ్రస్థాయిలోనే హుకుం జారీ చేసి డైనింగ్‌హాలులోకి దారితీశాడు.

రంగనాథం పర్వతరావుకు ప్రైవేటు కార్యదర్శిలాంటివాడు. ఏళ్ళ తరబడీ పర్వతరావుని కొలుస్తూనే వున్నాడు. కానీ ఆయన సైకలాజీ ఈపూటకి తెలుసుకో లేకుండా పోతున్నాడు.

'బహుశా ఏ మంత్రిగారికో ఏదో యిబ్బంది వచ్చి వుంటుంది! అందుకే ఇంత చిరాకు' అనుకుంటూ వెళ్ళి డ్రైవరుకి పని పురమాయించాడు.

డ్రైవరు విల్సన్ కారుని షెడ్‌లోంచి తీసి రెడీగా బయటుంచాడు. గేట్ దర్వాన్ సుఖమల్‌సింగ్ పెద్ద తలుపులు తీసి నిలిచాడు.

పర్వతరావు చేతిగుడ్డతో మూతి మాత్రమే నాజూకుగా తుడుచుకుంటూ న్యూమోడల్ కాంటెస్సా ఎక్కాడు. కారు తూనీగలా గేటుదాటింది.

"ఎస్పీ బంగళాకి పోనివ్వు" అన్నాడు

* * *

స్పెషల్ ఛాంబర్లా వుందా గది....

ఉండీ లేనట్లుగా ప్రసరిస్తున్న ఆకు పచ్చని కాంతి గదిలో ఓ వింత అందాన్ని ప్రసాదిస్తూంది. మనుషులున్నా లేరేమో ననిపించే నిశ్శబ్దత ఆవరించిన గది! రెండేరెండు ఆకారాలు ఆకుపచ్చని నీడల్లా కదులుతూ కనిపిస్తున్నారంతే. విశాల మైన కిటికీలకి పల్చని వెల్వెట్ తెరలు దించబడున్నాయి. బయటి ప్రపంచం సంగతి లోపలికి గానీ, లోపలి విషయాలు బయటికి గాని కనిపించే ప్రసక్తేలేని చీకటి వెలుగుల దోబూచులాట అక్కడి ప్రస్తుత తతంగం!

"ఛీఛీ! నా పరువంతా మంటగలిపావు గదరా! నే నంటే పంఘంలో ఎంత పరువుందో, నా కున్న పలుకుబడేమో

యువ

తెలిసే ఈ అప్రాచ్యపు పని చేశావా? కనీసం నీ తండ్రి పర్వతరావు అన్న సంగతైనా గుర్తుకిరాలేదా ఆసమయంలో? అప్పటికీ నీవు నా కొడుకని పోలీ సాఫీసర్లు గుర్తించారు కనుకే గప్‌చుప్‌గా నన్ను పిలిపించి ఎలానో పని సర్ది నిన్ను విడిపించారు. అయినా నీతో వచ్చి కట కటాలలో వున్న జనం రేపయినా బయ టికి రారా? నలుగురికీ నీ గురించి ప్రచారం చేయరా? నా పరువేమి? ఏమాత్రం దప్పుడు? అప్పుడు నేనేం కావాలిరా? ధూ! నా కడుపున చెడబుట్టావు!" గంభీరంగా రహస్యంగా, తీవ్రంగా దండిస్తున్నాడా ఛాంబర్లో పర్వతరావు.

ఎర్రబడ్డ కళ్ళు పచ్చని కాంతులతో సింహంకళ్ళలా వెలిగాయి. చెదిరి ముంగుర్లుగా మెలికలు తిరిగిన తల వెంట్రుకలు చిట్టిపొదల్లా కదిలాయి. కొన్ని రోజులుగా ఆహారంలేక సన్న పడ్డట్టున్న శరీరం కుబుసం విడిచిన నాగు బాములా, మసక విడిచిన పడగ నెమ్మ దిగా తలెత్తుతున్నట్లుగా తల పైకి లేచింది. ఒక విధమైన తీక్షణవీక్షణంతో పర్వతరావువైపు చూచాడు కొడుకు సురేందర్. వేసుకున్నది మాసిన జీన్స్ పాంట్స్! దానిపైన ఏదో చారల బుష్ షర్టు కింద రెండు బటన్లూతీసి అంచులతో ముడివేసుకున్నాడు.

అచ్చం తెలుగు సినిమాలో యంగ్ రెబల్ హీరో స్టైల్లో కనిపించాడు పర్వతరావుకి పుత్రరత్నం!

"అంటే... నేను తప్పు చేశాననా?" కంఠంలో తీవ్రత బాగా ధ్వనించింది.

"కాదా? తప్పున్నరతప్పు! కింగ్ మేకర్ పర్వతరావు కొడుకు, పొలిటికల్ పవర్ పర్వతరావు కొడుకు, మంత్రుల కైనా, వారి తాతలకైనా ఉపయోగపడే పర్వతరావు కొడుకు, మల్టీ మిలియనర్ పర్వతరావు కొడుకు, కోరుకుంటే రంభైనా ఇంటికే రప్పించుకోగల పర్వతరావు సొంత కొడుకు...ఆఫ్టరాల్ ...ఆ...ఫ్...ట... రాల్ ఒక దర్టీ బజార్ బిచ్ కోసం..." మాటలు పూర్తి కాలేదు.

"డాడీ! స్టాప్ ద నాన్సెన్స్ యూ ఆర్ టాకింగ్!" సురేందర్ ఖంగుమనే కంఠంతో హెచ్చరించాడు పర్వతరావుని.

పర్వతరావు జీవితంలో ఇంతవరకూ అలా శాసించగల మొనగాడెవడూ పుట్ట లేదు. అదిరిపోయాడు. కదిలిపోయాడు కోపంతో.

"యూ... దర్టీ స్కౌండ్రల్! నా మాటలు... నాన్సెన్స్ అంటావా? నేను సెన్స్‌లెస్‌నా నీ అర్థం?"

"ముమ్మాటికీ! నీవెవరిని గురించయితే దర్టీ బజార్ బిచ్ ... అని ఇంతలావు విశేషణంతో పొగుడుతున్నావో... ఆ మాటలన్నందుకే నీవు నీ 'నాన్సెన్స్' మెంటాలిటీని సార్థకం చేస్తున్నావూ అంటాను."

"ఛే...ఛే...ఛేయ్ షూట్! నువ్వా నువ్వా... నా కొడుకువి కాబట్టి... ఇంత లావు మాటలంటున్నా బ్రతికిపోతున్నా వురా! మరొకరైతే ఈపాటికి షూట్ చేసి చంపివుండేవాడ్ని! నిన్నెవరో పాయిజన్ చేశారు. నాకు తెలుసు... నాకు తెలుసు రోగ్! వాళ్ళ అంతుచూస్తాను. ఈ పర్వత రావు విశ్వరూపమేమో చూపిస్తాను" ఊగిపోతున్నాడు పర్వతరావు.

"బిపి ఎక్కువవుతున్నట్లుంది డాడీ! కాస్త ఆవేశం తగ్గించుకోండి. విశ్రాంతిగా కూర్చోండి! నేనేం చేశానో! చేసింది తప్పో ఒప్పో తర్వాత నిమ్మళంగా ఆలోచించి నిర్ణయించుకోండి. అడ్డదారిలో తెచ్చుకున్న పరువూ ప్రతిష్ఠలకూ ఎప్పుడో ఒకప్పుడిలాంటి పిడుగుపాట్లే తగిలి సమూలంగా కూలిపోతాయి. ధైర్యంగా నిజాల్ని చిత్తశుద్ధితో స్వీకరించగలిగి న్నాడే అసలైన పేరు వస్తుంది. ఇప్పుడు మీ పేరుప్రఖ్యాతులకి వచ్చిన నష్టమేమీ లేదు. ఒకరోజు జైలుగదిలో కూర్చు న్నంత మాత్రాన నాకు వచ్చిన కష్టమేమీ లేదు. రేపు కోర్టులోకి కేసునీడ్చినా కలిగే అఘాతం ఏమీ లేదు. సురేందర్ అంటే ఏ మ్యాన్ ఫర్ పర్ఫెక్ట్‌నెస్ అని ఈ సమాజానికంతా తెలుసు. తెలియంది మీకే... మీ పలుకుబడితో నన్ను విడి పించుకొని వచ్చారన్న అహంకారం మీ కుండవచ్చు. ఆఫ్‌కోర్స్! నేనూ అంగీకరిస్తాను, ధన్యవాదాలు కూడా! కానీ! ఒకటి గుర్తుంచుకోవాలి! విడిపించుకు రాకపోయినా విజయం నాకే కలిగేది... అసలు కథేమో మీకూ, సమాజానికీ తెలిసేది. ఆ ఛాన్స్‌ని మీరే నాశనం చేశారు! అయినా మునిగిందేమీలేదు. నా పని నేను చేసుకుంటూ వెళతాను. వస్తాను గుడ్ నైట్!"

సురేందర్ ఛాంబర్ తలుపులు తీసి బయటికి వెళ్ళిపోయాడు.

"ఆగు!" పర్వతరావు సుపుత్రుని సుదీర్ఘ సంభాషణ విని త్రుళ్ళిపడి గర్జిం చాడు. సురేందర్ ఆగాడు.

"పర్వతరావు హోదానీ, పరువునీ చాలా తక్కువ అంచనా వేస్తున్నావు!"

"మీ కొడుకేనన్న సంగతే మీరు మరచిపోతున్నట్లున్నారు."

"షటప్! ఈ ఇంట్లోనే కాదు! ఈ పట్నంలోనే కాదు, ఈ రాష్ట్రంలోనే ఈ పర్వతరరావు మాటకి ఎదురు లేదు తెలుసా?"

"గోడ్లూ, గోడలూ, కొండలూ మీ మాటల్ని సరకుచేయవని తెలుసుకోండి!"

పర్వతరావు వెటకారంగా నవ్వాడు.

ముభావంగా తండ్రివైపు చూశాడు సురేందర్.

"ఊఁ నీవో గొడ్డువి, జడపదార్థానివి అని నీవే చాటుకుంటున్నావన్నమాట!"

"ఔను! మూర్ఖుల ఆదేశాలు వినిపించు కోకుండా ఉండేందుకీ, విరిగి మీద పడేందుకూ" అని విసవిస బయటికి

నడిచిపోయాడు.

పర్వతరావు నిశ్చేష్టుడై అలాగే నిలబడిపోయాడు.

కొంచెంసేపటికి తెప్పరిల్లుకున్నాడు. వెంటనే ఫోన్ చేశాడు.

"హలో! ఎవరూ? యస్పీగారా ముందా డర్టీబిచ్‌ని అరెస్ట్ చేసేయండి! దాని కొంపని సీల్ చేసేయండి మావాడు మళ్ళీ ఆ పరిసరాల్లో కన్పిస్తే ములాయిజా లేకుండా అరెస్ట్ చేసేయండి చూడండి! ఈమారు...అన్‌బయిలబుల్ వారెంట్‌తో చేసేయండి" అంటూ ఫోన్ పెట్టేశాడు.

* * *

"యూ ఆండరరెస్ట్ మిష్టర్ సురేందర్" యస్సయి వారంటు చూపిస్తూ కోమలా దేవి భవంతిలో వున్న సురేందర్ని అరెస్ట్ చేశాడు.

"నేను జామినిస్తున్నాను ఇన్‌స్పెక్టర్ గారూ! అతన్ని వదిలేయండి" అధికారికంగా మాట్లాడింది కోమలా దేవి.

యస్సయి వెకిలిగా నవ్వాడు.

"ఇంకా చూస్తారేమిటోయ్! ఈ డర్టీ బిచ్‌నీ, దాని కూతుర్నీ కూడా తోసెయ్యండి వ్యాన్‌లోకి. కొంపకి సీలు వేసెయ్యండి." యస్సయి ప్రతి మాటలోనూ వెకిలీ, వెటకారమూ ధ్వనిస్తున్నాయి.

సురేందర్ ఆవేశంలో ఊగిపోతున్నాడు.

"ఇన్‌స్పెక్టర్‌గారూ! తప్పు నాదను కున్నారు నన్ను తీసుకువెళుతున్నారు. మధ్య వీరేం చేశారని? ఈ మాటల వెటకారమేమిటి?"

"షటప్! కమాన్!"

"నేను వస్తాను వాళ్ళెందుకూ అని అడుగుతున్నాను."

"నీ కనవసరం అంటున్నాను. పద వోయ్!" తోసుకుంటూ వ్యాన్ దగ్గరకు వెళ్ళాడు.

కానిస్టేబుళ్ళు అసభ్యంగా కోమలా దేవినీ, ఆమె కూతురు విమలనీ కూడా ఈడ్చుకుంటూ వచ్చి వేన్లోకి నెట్టారు.

కోమలా దేవి నలభై ఏళ్ళు దాటినా మధ్యవయస్సుతో మంచి శరీరచ్ఛాయతో నిండు ముత్తయిదువులా అవుపిస్తుంది. కొత్తగా చూసినవాళ్ళెవరికీ ఆమెమీద దురభిప్రాయం కలిగే అవకాశమే లేదు. గొప్పింటి స్త్రీలా అణుకువ సౌజన్యమూ ఆమె ముఖంలో తాండవిస్తూంటాయి.

సమాజం వేశ్యమాత ముద్రవేసిం దావిడకు. ఎన్నెన్నో పిటీషన్లు ఆమెమీద వెళ్ళాయి పర్యవసానం యిది.

విమల నవనవలాడే యౌవనంతో మిసమిసలు పోతూంటుంది. ఇంటివద్దే సంగీతం నాట్యం నేర్చుకుంటూంది. ఎందరెందరో ఆమెని చూస్తూ లొట్టలు వేస్తూ ఇంటి చుట్టూ ప్రదక్షిణలు చేసేవారు! ఫలితం సంగతి దైవమెరుగు. పర్యవసానం అదే.

వ్యాన్లోకి రాక్షసుల్లా తోసినప్పుడు

విమల నుదుటికి పీట్ బార్ గుద్దుకొని చిట్లింది. సురేందర్ తన హేండ్ కర్చీఫ్ నుదుటికి కట్టాడు.

పక్కనకూచున్న పోలీసులు మరీ వికారంగా వారి అనుబంధాన్ని వర్ణించి తృప్తిపడ్డారు. సెంటర్లో ట్రాఫిక్ జాం కావడంతో వ్యాన్ ఆగిపోవలసివచ్చింది. వ్యాన్ పక్కగానే మోటర్ బైక్ మీద లాయర్ రామచంద్ర నిలబడున్నాడు. సురేందర్ అనుకోకుండా సైడ్ వెంటి లేటర్లోంచి చూడడం, సంబరపడటం ఒకేమారు జరిగింది.

"రామూ! స్టేషన్ కి రారా! అవసరం" అన్నాడు.

అక్కడింకేమీ అడగనూ లేదూ రామచంద్ర చెప్పనూ లేదు. ట్రాఫిక్ క్లియరవుతుండగా చివ్వున ముందుకు దూసుకు పోయాడు.

'డామిట్! వెధవ లీడింగ్ లాయరవుతున్నానని నీల్గాడు. రానీ అవకాశం రావాలీ, వాడి సంగతి చూడాలి' అని వ్యసనపడ్డాడు సురేందర్.

వ్యాన్ స్టేషన్ ముందాగింది.

తలుపులుతీసి ఒక్కొక్కరినే దింపారు. సురేందర్ కిందకు దిగగానే ఎదురుగా రామచంద్రే ముందవుపించటం చూపి స్తబ్ధుడై ఆనందంతో మునిగిపోయాడు.

"ఆరే మేరేయార్!" అంటూ కౌగిలించుకుంటూ జరిగిన సంగతి చెప్పాడు.

స్టేషన్లోకి పోగానే రామచంద్ర యస్సైతో మాట్లాడాడు.


"నిజమే! సురేందర్ కు మాత్రమే అన్ బెయిలబుల్ వారెంట్ తెచ్చారు. న్యాయశాస్త్రరీత్యా అతన్నైనా మీరు లాకప్‌లో పెట్టే వీలులేదు. వెంటనే కోర్టులో హాజరు పరచండి. అతని తరఫున లాయర్ ని నేనే! పోతే, అసలు వారెంట్లే లేకుండా ఆడవాళ్ళని అరెస్ట్ చెయ్యటమేమిటి? చట్ట విరుద్ధం! అనుమానంమీదో, ఎవరి నోటి పిటిషన్ మీదో అయినా నేరస్థుల్లా అనాగరికంగా ఆడాళ్ళని స్టేషన్ కి తీసుకు రావడమే నేరం. వాళ్ళిద్దరినీ మర్యాదగా వదలివేయాల్సిందే లేకుంటే తీవ్రమైన కాన్సిక్వెన్సులని మీ రెదుర్కోవలసి ఉంటుంది. చట్టం ముందు మనిషి వేరూ, పోలీసాఫీసరు వేరూ కాదు." అన్నాడు రామచంద్ర.

"పర్వతరావుగారు మీకు తెలుసా?" ఎదురు ప్రశ్న వేశాడు యస్సై.

"చాలా బాగా తెలుసు! మా సురేందర్ నాన్నగారేగా".

"ఆయన సంగతి మీకు తెలుసా అనడుగుతున్నాను" రెట్టించిన స్వరంతో అడిగాడు యస్సై.

"ఆయనకీ, మీకూ 'లా' సంగతీ, నా సంగతీ తెలిపినట్లు లేదు. ముందు ఆ ఆడవాళ్ళిద్దరినీ పంపెయ్యండి. లేకుంటే కోర్టునుండి రావలసిన వారెంటేదో మీకే వస్తుంది. 24 గంటలలో సురేందర్ని కోర్టుకు హాజరు పరచండి. వాళ్ళ నాన్న




గారూ వస్తారూ కోర్టుకి." అంటూ లేచాడు రామచంద్ర

యస్సయి యిరకాటంలో పడ్డాడు. అయినా యంగ్ లాయర్ రామచంద్ర ఎఫిషియంట్ క్రిమినల్ లాయర్‌గా మంచి పేరున్నవాడు. ఉచ్చు ఎవరికి ఎక్కడ తగిలించాలనుకున్నా తగిలించ గల లిటిగెంట్ లాయరనీ తెలుసు.

"ఏయ్ టునాట్టూ ముందా ఆడాళ్ళని ఇంటికి పంపేసిరా!" ఆదేశించాడు.

"మరి...మరి...సర్వ..." నసిగాడు పోలీసు.

"లాయరూ ఆయనా చూచుకుంటార్లే పో..." ఉరిమాడు.

పోలీసు బహు మర్యాదగా రిక్షాలో సాగనంపాడు కోమలా దేవినీ-విమలనీ.

* * *

"నీ పేరు?" ప్రాసిక్యూటర్ అడిగాడు

"సురేందర్."

"ఏం చేస్తుంటావు నువు?"

"అన్యాయానికీ, అవినీతికీ వ్యతిరేకంగా పోరాటంచేస్తుంటాను!"

కోర్టుహాలంతా ఒకరకమైన నవ్వులతో చప్పట్లతో గలభా అయింది.

బల్ల చరిచాడు న్యాయమూర్తి.

"నువు సినిమాలు బాగా చూస్తావా? అందునా క్రయిమ్, స్టంట్ మసాలాలు వున్నవి?"

హాల్లో మళ్ళీ శబ్దం. మళ్ళీ 'ఆడరాడర్' చరుపుడు.

"ఏం? సినిమాలు లేకముందు అన్యాయం లేదనా మీ వుద్దేశ్యం?" సురేందర్ ఎదురుప్రశ్న వేశాడు.

కోర్టుహాలు మళ్ళీ సెభాష్ ధ్వనులతో మోగిపోయింది. బల్ల మళ్ళీ చరిచింది.

"వాట్ నాన్సెన్స్ యూ ఆర్

అప్పీలింగ్?" ప్రాసిక్యూటర్ కోపంతో విరుచుకుపడ్డాడు.

"అబ్జక్షన్ యువరానర్!" అంటూ రామచంద్ర లేచాడు. తాను సురేందర్ తరపున లాయర్‌గా పత్రాలు జడ్జీకి అందించాడు.

"యస్! ప్రొసీడ్!" అన్నారు జడ్జి.

"ప్రాసిక్యూటర్‌గారే అసలువిషయం వదలి సినిమాల ప్రసక్తి తెచ్చినపుడు దానికి తగిన సమాధానంగా అడిగిన ముద్దాయి ప్రశ్న నాన్సెన్స్ ఎలాగవుతుంది?"

"అబ్జక్షన్ అంగీకరించబడింది" అన్నాడు జడ్జి

ప్రాసిక్యూటర్ ఎగాదిగా కోపంగా చూచాడు రామచంద్రవైపు, సురేందర్ వైపూను.

"క్షమించండి యువరానర్! సమాజాన్ని కలుషితం చేస్తూ, ఈనాటి యువతరం మనస్సులను పెడదారిపట్టిస్తూ వస్తున్న వెధవ వెకిలిసినిమాల ప్రభావం వల్లే సురేందర్ కూడా ఆ సినిమా హీరోలా అవినీతికీ అన్యాయానికీ వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నానంటూ పెద్దపెద్ద డైలాగులు చెబుతున్నాడు. అవినీతినైనా, అన్యాయాన్నైనా నిర్మూలించాలంటే చట్టాలున్నాయి, న్యాయస్థానాలున్నాయి, పోలీసులున్నారు. కానీ ఒక సాధారణ వ్యక్తి తానే చట్టాన్ని చేతిలోకితీసుకోవటం కేవలం సినిమాల్లో జరిగేదే కానీ నిజసమాజంలో జరిగేది కాదు. ఒకవేళ అలా నిజంగా జరిగినా, ఎవరైనా అలా చేసినా అది నేరమే అవుతుంది. సినిమాహీరోలా ఎవరూ అతన్ని జేకొట్టరు సరికదా, మెడపట్టి కటకటాలలోకి తోస్తారు. సురేందర్ అలాంటి నేరమే చేశాడు. కనుకే పోలీసు లతన్ని అరెస్ట్ చేశారని మనవి చేసుకుంటున్నాను" అంటూ సుదీర్ఘంగా తన గంభీర గళంతో వాదించాడు ప్రాసిక్యూటర్.

"అబ్జక్షన్ యువరానర్! ముద్దాయి సురేందర్ సినిమాహీరోలా ఏదో చట్టం తనచేతిలోకి తీసుకొని వ్యవహరిస్తే అరెస్టుచేశారు పోలీసులు— అని గౌరవనీయ ప్రాసిక్యూటర్ గారన్నారు. యస్సైగారిని కొంచెం బోనులోకి పిలిపిస్తారా?"

గ్యాలరీలోనుండి యస్సై బోన్లోకి వచ్చి నిలిచాడు.

"యస్సైగారూ! సురేందర్‌ని మీ రెన్నడరెస్టు చేశారో చెబుతారా?" రామచంద్ర అడిగాడు.

"నిన్ననే."

"బాగా గుర్తుచేసుకొని మరీ చెప్పండి" రెట్టించి కొంచెంగా అడిగాడు రామచంద్ర.

"నిన్ననే అరెస్ట్‌చేశానన్న సంగతి మీకూ తెలుసు!" కోపంగా చిరాగ్గా చెప్పాడు యస్సై.

"కోప్పడకండి సర్! ఏ పద్ధతిలో

అరెస్ట్ చేశారంటారు?"

"అన్ బెయిలబుల్ వారంటుమీద."

"అలానే ఎందుకుచేశారు?"

"వాళ్ళ నాన్నగారలా చెయ్యమని చెప్పారు..." అంటూ నాలిక్కరచుకున్నాడు యస్సై.

"నోట్ ద పాయింట్ యువరానర్. సురేందర్ నాన్నగారు శ్రీ పర్వతరావుగారు చెప్పిన రీతిలో యస్సయిగారు అరెస్ట్‌చేశాడు. అంతేకానీ సురేందర్ ఏ నేరం చేశాడో మాత్రం పాపం యస్సయికి తెలీదు."

"నోనో. సురేందర్ నేరంచేశాడు. చట్టం తన చేతికి తీసుకొని ప్రవర్తించాడు" గట్టిగా మొత్తుకున్నాడు యస్సై.

"ఎప్పుడు?"

"మూడురోజుల క్రితం."

"మీరెలా చెబుతున్నారు సురేందర్ చట్టం తనచేతుల్లోకి తీసుకున్నాడని?"

"అది చట్టంగిట్టం ప్రసక్తి కాదు. కోమలాదేవి యింటిముందు రౌడీమూక అందరూ చెయిన్లతో, లాఠీలతో కొట్టుకుంటూంటే మేం వెళ్ళి అందర్నీ అరెస్ట్ చేసి లాకప్‌లోకి తోశాం. వాళ్ళలో సురేందరూ వున్నాడు."

"మరతను చట్టం తనచేతుల్లోకి తీసుకున్నాడన్నా రింతకుముందు?"

"ఆ రౌడీలని తానే శిక్షిస్తున్నట్లు అతనన్నాడు గనుక."

"మరి నిన్ననే అరెస్ట్ చేశారంటా ంవిటీ?"

"ఆరోజు సురేందర్ని వదిలేశాం గనుక?"

"ఏం, ఎందుకని? హీరో అనా?"

కోర్టుహాలంతా కిలకిల నవ్వుతుంది, వెంటనే నద్దుమణిగింది. యస్సయి బట్ట తలనుండి నుదురుదనుకా చిరుచెమటలు తుడుచుకున్నాడు. రామచంద్ర ప్రశ్నలకు వణుకు పుట్టుకువస్తూ కంపరమెత్తుతోంది అతనికి.

"పర్వతరావుగారు జామీను ఇచ్చారు గనుక. వారు సురేందర్ తండ్రిగారు, నగరంలో వారు చాలా పెద్దమనుషులు కనుక. స్వయంగా వారే వచ్చి..." అంటూ వెంటనే గతుక్కుమన్నాడు యస్సయి. బెదురుచూపులతో గ్యాలరీలో కూర్చున్న పర్వతరావుని చూస్తూ.

"మధ్యే ఆగిపోయారు? వారుస్వయంగా రాలేదా? జామీనసలివ్వనేలేదా?" రామచంద్ర గ్రుచ్చిగ్రుచ్చి అడిగాడు.

"పర్వతరావుగారు స్వయంగా యస్పీగారినే కలిసి అక్కడే జామీను పత్రాలు ఇచ్చారు. యస్పీగారు మాకు ఫోన్‌చేసేరు మేం వదిలేశాం" గబగబా చెప్పేశాడు యస్సయి.

"నోట్ ద పాయింట్ యువరానర్?" అంటూ, "అంటే... ముద్దాయిని విడిపించుకునేందుకు జామీను ఎక్కడా ఏ అధికారికిచ్చినా మీ పోలీసుచట్టంలో చెల్లుతుందన్నమాట. బావుంది. అనిసరే.

మరి విన్న మళ్ళీ ఎందు కరెస్టుచేశారు?"

"బ్రోతల్ ఆక్టుకింద అరెస్టు చేశాం."

"అన్‌బెయిలబుల్ వారంటుతో వెళ్ళా రేమి మరి? అక్కడ ఫలాన సురేందర్ ఒక్కడే వుంటాడని, అన్‌బెయిలబుల్ వారంటు తీసుకు మరీ పోవాలని ముందే ఊహించి రెయిడ్ చేశారా?"

"ఓ...హ్..." అంటూ ఉన్న కొత్త జుత్తూ అర్థంకాక పీక్కున్నాడు యస్సై.

అతని అవస్థ ప్రాసిక్యూటర్‌కి విప రీతమైన జాలి కలిగించింది. వెంటనే లేచి "అబ్జిక్షన్ యువరానర్! ముద్దాయి తరపు లాయర్ రామచంద్రగారు అనవసరమైన యక్షప్రశ్నలతో కావాలనే కేసును తారు మారు చేసే ఉద్దేశంతో యస్సైయిని ఇంగారు పెట్టేస్తున్నాడు" అంటూ గర్జించాడు.

"నో యువరానర్! పోలీసుల ఆరె స్టులూ విడుదల్లో వున్న అవకతవకల్ని మీ కెరుకపరచాలనీ, పోలీసుల, పెద్ద మనుషుల చేతుల్లో చట్టం ఎలా దుర్విని యోగమౌతుందో ఋజు చేయాలనీ మాత్రమే రీజనబుల్ క్వశ్చెనింగ్ చేస్తున్నాను" అన్నాడు వెంటనే రామ చంద్ర.

"అబ్జక్షన్ తిరస్కరింపబడినది, ప్రొసీడ్ మిష్టర్ రామచంద్రా!" అన్నాడు జడ్జ్.

ప్రాసిక్యూటర్ తలవంచుకున్నాడు. యస్సై తల బాదుకున్నాడు.

"యస్సైగారు. బాధ్యతగల పోలీ సధికారులు మీరు, చట్టం తన చేతుల్లోకి తీసుకున్నాడని సురేందర్ని అరెస్టుచేసిన మీరే చట్టాన్ని పలుకుబడున్న బడా మను షులకోసం దుర్వినియోగం చేయడం న్యాయంకాదు. నిజం చెప్పండి! సురేం దర్ని ఎందుకు వదిలారు? మళ్ళీ ఎందుకు అరెస్టుచేశారు?"

యస్సై నెమ్మదిగా తలెత్తి ధర్మా సనంవైపు చూచాడు. 'సత్యమేవ జయతే' అని కనిపిస్తూ ధర్మత్రాసు పట్టు కున్న న్యాయదేవతబొమ్మ కనిపించింది.

"యువరానర్! మేము మాపై అధి కారుల ఆదేశాలని పాటించవలసిన ఉద్యో గులం. కోమలాదేవి ఇంటిముందు రౌడీ లని ఎడాపెడాబాదేస్తూ ప్రాణహానికలిగేలా స్టంట్‌చేస్తున్న సురేందర్ని మా బాధ్యత రీత్యా ఇతరులతోపాటే అరెస్టు చేశాను. కానీ, మరునాడే అతన్ని వదిలివేయ వలసిందిగా యస్పీగారినుండి టెలిఫోన్ మెసేజ్ వచ్చింది. వదిలేయక తప్పలేదు. తర్వాత పర్వతరావుగారే స్వయంగా ఫోన్‌చేస్తు అన్‌బెయిలబుల్ వారెంట్ మీద సురేందర్ని అరెస్ట్ చేయమని ఆర్డించాడు ఈ సిటీలో ఆయనకున్న పేరూ పలుకుబడీ హోదా మీకు తెలీనివేం కాదు. ఆయన మాట పాటించక తప్పదు మాకు. అరెస్ట్ చేశాం. ఇది నిజం!"

"అంటే ఏ నేరమూ లేకున్నా ఎవరో పెద్దమనిషి ఫోన్‌చేస్తే చాలు ఎవరినైనా

మీ రరెస్టుచేస్తారన్న నిజాన్ని ఒప్పు కుంటున్నారు... అంతేనా?" రామచంద్ర ఘాటుగా ప్రశ్నించాడు.

యస్పయి మౌనంగా తలవంచాడు.

"దట్సాల్ యువరానర్! పర్వతరావు గారిని విచారించేందుకు అనుమతించండి" అవి ప్రార్థించాడు.

"ద కోర్ట్ ఈజ్ అడ్‌జర్న్డ్ టుమారో" అంటూ జడ్జ లేవగానే రామ చంద్ర బెయిల్ పిటీషన్ జడ్జ ముందుం చాడు. 'మంజూరైనది' అంటూ సంతకం పెట్టి ఛాంబర్లోకి వెళ్ళిపోయాడు.

సురేందర్ రామచంద్రని కౌగిలించు కొంటూ ధన్యవాదాలు తెలిపి బయటికి నడిచాడు.

పర్వతరావు రుసరుసలాడుతూ కార్లో వెళ్ళిపోయాడు.

* * *

పర్వతరావు పేరు తెలియనివా డెవడూ లేడు నగరంలో. ఆయన పార్టీలు మార్చగలడూ, కూల్చగలడూ అన్న పేరు వుంది. ఎంతటి అధికారయినా, హోదా గల పెద్దమనిషయినా పర్వతరావు పలుకు బడికి లొంగిపోవాల్సిందేనవీ జనాని కెన్నాళ్ళనుంచో తెలుసు.

అయినా ఇప్పుడు పర్వతరావుకీ, ఆయన కొడుక్కీ వైరుధ్యం రావటం, అందునా వ్యవహారం కోర్టులోసాగడం, పర్వతరావు మాటని కాదని సురేందర్‌కు బెయిలు దొరకటం అన్నీ వార్తలుగా, కథలుగాన గరమంతా ప్రాకటం. జనానికి చాలా ఆసక్తిని కలిగించిన విషయమై కూర్చుంది.

అందునా లాయర్ రామచంద్ర వాదనా చాతుర్యం, ప్రాసిక్యూషన్ కథనం చెల్లకపోవటం, యస్పయి తత్తర్లాడడం అన్నీ జనాన్ని ఊపివేశాయి. మరునాడు ఎంత రంజుగా వుంటుందో కేసువాదన, ఫలితం ఎలా వుంటుందోనని ఆసక్తితో జనం కోర్టుముందు గుమిగూడారు! ప్రేక్ష కుల గ్యాలరీలో పెద్దలకూ, పెద్ద పలుకుబళ్ళకు మాత్రమే ప్రవేశం దొరి కింది. మిగిలిన జనాన్ని కంట్రోల్ చేయను పోలీసులబలగం బయట నానా హైరానా పడాల్సివచ్చింది.

న్యాయమూర్తి ధర్మాసనం అధిష్ఠిం చారు. ముద్దాయి సురేందర్ బోనులో నిలబడ్డాడు. ప్రాసిక్యూటర్ ఆవేశంతోనూ చిరాకుతోనూ విసురుగాలేస్తూ తన వాద నని మొదలుపెట్టాడు.

"యువరానర్! ముద్దాయి సురేందర్ చట్టవిరుద్ధంగా తానే సమాజరక్షకుడన్న హీరోయిజంతో బజార్లో మనుషుల్ని తన్నింది నిజం! అది ముద్దాయే స్వయంగా అంగీకరించిన విషయం. రెండవది సంఘంలో పేరు ప్రఖ్యాతులుగల నైస్ జంటిల్మన్ పర్వతరావుగారి కొడుకతను. అయ్యుండీ తండ్రి గౌరవానికే చెడ్డపేరు తెచ్చేలా బ్రోతల్ హౌస్‌కి..."

ప్రాసిక్యూటర్ మాట పూర్తికాక

ముందే, "స్టాప్ ద డర్టీ బ్లేమ్స్ మిష్టర్ ప్రాసిక్యూటర్! స్టాపిట్!" అంటూ గర్జించాడు సురేందర్.

కోర్టు హాలంతా గింగురుమంచిదా పెదబొబ్బతో.

"ఆడర్! ఆడర్. అనవసరంగా కేకలు వేయకు!" మందలించాడు జడ్జి.

"సారీ యువరానర్! ప్రాసిక్యూటర్ అనవసరమైన నిందలు అబలల మీద మోపుతున్నందుకు... ఆవేశమూ, కోపమూ ..." మాట్లాడలేకపోయాడు సురేందర్.

"నాన్సెన్స్! పోలీసు రికార్డులున్నాయి, సాక్ష్యాధారాలున్నాయి...అది...బ్రో.." ప్రాసిక్యూటర్ని మళ్ళీ పూర్తిగా మాట్లాడ నివ్వకుండానే లాయర్ రామచంద్ర 'అబ్జక్షన్' అంటూ లేచాడు.

"యువరానర్! ఒకసారి ఏదో తెలిసీ తెలియక ప్రయోగించిన పదాలు ముద్దాయికి ఆవేశం తెప్పించాయి. తెలిసీ మళ్ళీ అవే మాటలు ప్రయోగించి ప్రాసిక్యూటర్ గారు ముద్దాయిని కోపిష్టిగా నిరూపించి నిజంగా నేరస్థుడని భ్రమింపజేయబోతున్నారు. ఇది న్యాయశాస్త్రానికే కాదు మానవతా ధర్మానికి కూడా విరుద్ధం" అన్నాడు.

"అబ్జక్షన్ అంగీకృతం- ప్రొసీడ్!"

"యువరానర్! ప్రాసిక్యూటర్ వారు సురేందర్ ఏదో వ్యభిచారగృహంలో ఉన్నట్లు చెబుతూ అది అతని తండ్రి గౌరవ ప్రతిష్ఠలకు భంగకరంగా నేరం ధ్రువీకరింపబోతూ వున్నారు. ఔనా ప్రాసిక్యూటర్ గారూ?"

"అక్షరాలా అంతే! ఉన్న నిజమూ అంతే!"

"సురేందర్ వెళ్ళినచోటు వ్యభిచార ప్రదేశమనీ, అది అలాంటిల్లని మీ కెలా తెలుసు?"

"పోలీసుల రికార్డులవల్ల! యస్సాయి గారి అఫిడవిట్‌లో వ్రాతలవల్ల!"

"యువరానర్! యస్సైగారిని విచారించేందుకు అనుమతించండి" రామచంద్ర అర్థించాడు. జడ్జి అనుమతించాడు. యస్సాయి మళ్ళీ చిరాకుపడుతూ అయోమయంగా వచ్చి బోన్లో నిలిచాడు.

"యస్సాయిగారూ! మీరు మామూలుగా రెయిడ్ చేసే బ్రోతల్ వీధులేవి?"

"మూసాబజార్ ఒకటి. మార్కెటు వెనక సందొకటీను. ఈ రెండిట్లోనే బ్రోతల్ హౌసెస్ విరివిగా ఉంటాయి."

"వెరీగుడ్! సురేందర్ ఎవరింట్లో వుండగా అరెస్ట్‌చేశారో మీకు తెలుసుకదా! ఆ యిల్లున్న వీధి చెప్పగలరా?"

"ఎందుకు చెప్పలేమండీ; అది చాలా ప్రసిద్ధమైన వీధి. అక్కడంతా నగల వ్యాపారుల భవంతులే. అందుకే రాజా స్ట్రీట్ అంటారు. అక్కడ వాసవీ భవనం కూడా వుంది. టెంపుల్ స్ట్రీట్ అనీ అంటారందుకే" ఉల్లాసంగా జవాబిచ్చాడు యస్సాయి.




"ఊరి వీధుల సంగతులన్నీ బాగా స్టడీ చేశారు మీరు. దట్స్‌గుడ్। మరి అది బ్రోతల్ హౌసుండే వీలున్న వీధెలా అవుతుంది?"

యస్సయి గతుక్కుమన్నాడు.

"అది...మరి.." నాన్చాడు మాటల్ని యస్సయి.

"నోట్ ద పాయింట్ యువరానర్। ప్రాసిక్యూషన్ వారు చెప్పిన పోలీసు రికార్డులలోని వ్రాతలే కేవలం ఊహాగానాలు. ధనికులూ, మర్యాదస్తులూ ఉండే చోట ఒక మర్యాదస్థురాలి భవంతిలో ఉండిన సురేందర్నీ, ఆ యింటావిడనీ, ఆవిడ కూతుర్ని బ్రోతల్ ఏక్టుక్రింద అన్యాయంగా అరెస్టుచేశారు. పైగా తప్పుడు వాదనలతో సమర్ధించుకోబోతున్నారు.

"మరో ప్రశ్న యస్సయిగారూ. ఆ యింటిమీద-ఇంతకు ముందెన్నడయినా రెయిడ్ చేశారా మీరు?"

"లేదు."

"మరి మొన్ననే ఎందుకంత ఆకస్మాత్తుగా రెయిడ్ చేశారు. ఎవరన్నా మిమ్మల్ని పురమాయించారా? లేక...ఇన్‌ఫర్మేషన్ అందిందా?"

"అలాని ఇన్‌ఫర్మేషనే వచ్చింది... వెళ్ళాం"

అక్కడా సుందరొక్కడే వుంటాడూ, అతన్నీ, ఆ యింటి ఆడాళ్ళనీకూడా అరెస్ట్ చేయమనేనా ఆ ఆదేశం?"

"ఆదేశం కాదు ఇంఫర్మేషన్."

"ఆ... అదే... అలానే వచ్చిందన్నమాట। యువరానర్। దీన్నిబట్టి సురేందరన్నా, ఆ యింటి ఆడవాళ్ళన్నా

గిట్టనివారే ఎవరో తప్పుడు ఇన్‌ఫర్మేషన్ ఇస్తే యస్సయిగారు అరెస్ట్‌చేశారు. అయితే ఎవరంటే వారలా ఇంఫర్మేషనిస్తే వెళ్తారా? వెళ్ళరు. అంటే ఎవరో పెద్ద... పలుకుబడున్న వ్యక్తే అయ్యుండాలి. యిస్సయిగారూ! ఆ ఇన్‌ఫర్మేషనిచ్చిన పెద్దవారెవరో తెలుసా మీకు?"

"తెలియదు."

"మరి రేత్రొద్దున మరొకరెవరో మీకు ఫోన్‌చేసి పోలీసుక్వార్టర్సులో ఒక ట్రోతల్ ముఠా వుంది ఫలానా యింట్లో అని చెబితే వెళతారా?"

కోర్టు హాలంతా పకపకలతో నిండిపోయింది.

యస్సయి మొహం కందగడ్డలా కందిపోయింది.

"అబ్సర్డ్! పోలీసు డిపార్ట్‌మెంట్ అంత మూర్ఖంగా వుంటుందనుకోవటం మీ తెలివితక్కువ."

"ఐ ఎగ్రీ! మీరన్నీ తెలుసుకోందే బయలుదేరరు... ఐనో... అందుకే అడిగేది. మీకు ఇన్‌ఫర్మేషన్ ఇచ్చినవారెవరో మీకు తెలుసుననే..."

"ఔను... తెలుసు... పర్వత..." సగంలో ఆగుతూ తానెలా పప్పులో అడుగేసింది చప్పున స్ఫురించి తికమకగా తలవంచుకున్నాడు.

"దట్సాల్ యువరానర్! మహాఘనత వహించిన శ్రీ శ్రీ పర్వతరావుగారే అకారణ ద్వేషంతో కొడుకునీ, ఆ కొడుకుండిన ఇంటి అబలలనీ అరెస్టుచేయమని పురమాయిస్తే, పలుకుబడికీ, ధనగర్వానికి లొంగిపోతూ పోలీసు డిపార్ట్‌మెంట్ అన్యాయంగా సురేందర్నీ, ఆ ఆడవాళ్ళనీ అరెస్ట్‌చేసింది. కానీ నా జోక్యం వల్ల అరెస్ట్‌వారెంట్ లేవి కారణంగా ఆడాళ్ళని వదిలారు యస్సయిగారు. కానీ సురేందర్ని కోర్టుకి లాగారు. న్యాయాన్యాయాలు మీరే విచారించాలి యువరానర్!" అంటూ రామచంద్ర కూర్చున్నాడు.

"ప్రాసిక్యూషన్ వారు పర్వతరావుని విచారించండి!" ఆదేశించాడు జడ్జ్.

పర్వతరావు బోనులోకి వచ్చి ప్రమాణం చేశాడు.

"పర్వతరావుగారూ! సురేందర్ మీ అబ్బాయే కదా?"

"ఔను!"

"మరి మీరే అతన్ని అరెస్ట్‌చేయమని పోలీసువారి నెందుక్కోరారు?"

"నా పేరు ప్రఖ్యాతులకు నింద కలిగేలా ప్రవర్తించసాగాడు కనుక! మా వంశ మర్యాదకే భంగకరంగా సమాజానికి చీడపురుగ్గా తయారయ్యాడు గనుక! చట్టమన్నా, న్యాయమన్నా నా కమిత గౌరవం. వాటినెవరు ప్రయోగించాలో, పరిరక్షించాలో వారు మాత్రమే ఆ పని చేయాలన్న నీతి నియమం వున్నవాడ్ని కనుక, వాటికి వ్యతిరేకంగా నడిచేవారెవరైనా, నా సొంత కొడుకైనా సరే చట్టాని

తప్పగించకపోతే నేను సంఘద్రోహి నవుతాను. కనుక అరెస్ట్ చేయమని కోరాను." పర్వతరావు కళ్ళజోడుని ఎడంచేత్తో తీసుకుని కుడిచేత ధోవతి చెంగుతో రిమ్ములనూ, గ్లాసులనూ నింపాదిగా తుడుస్తూ తాపీగా సమాధానమిచ్చాడు.

"దట్సాల్ యువరానర్! సమాజ సేవాతత్పరుడైన పర్వతరావు తన తన్న కొడుకునైనా నేరంచేస్తే చట్టాని కప్పగించే నిస్వార్థబుద్ధికలవాడని విదితమౌతుంది. వాట్ ద పాయింట్ యువరానర్!" అన్నాడు ఎంతో తీవిగా ప్రాసిక్యూటర్.

"యువరానర్! పర్వతరావుగారిని విచారించేందుకు అనుమతించండి" అంటూ రామచంద్ర అడిగాడు.

"ప్రొసీడ్!" అన్నాను జడ్జ్.

"పర్వతరావుగారూ! మీ మాటల్ని వింటూంటే నాకు పురాణగాథలు గుర్తు వస్తున్నాయి. నిజంగా మీరు అభినందనీయులు! చట్టానికి భిన్నంగా ప్రవర్తిస్తే స్వంత కొడుకునైనా పోలీసుల కప్పజెప్పే మీ న్యాయబుద్ధికి నా జోహారు!"

"గేలి చేస్తున్నావా?" పర్వతరావు కటువుగా ప్రశ్నించాడు.

"నిజంగానే అంటున్నాను. కానీ... ఒక చిన్న సందేహం వస్తూంది"

"అతితెలివి ప్రయోగించి అడ్డదిడ్డం ప్రశ్నలు వేయకు! పర్వతరావుతో పరాచికాలు ప్రాణాలకంత ఆరోగ్యం కాదు. జాగ్రత్త!" కేవలం రామచంద్రకు వినపడేలా పళ్ళుబిగించి మాట్లాడాడు పర్వతరావు,

"న్యాయాన్ని చట్టాన్ని గౌరవించే వారి పవిత్రవాక్కులివి: అహా!" అని అంతే చిన్నగా "న్యాయాన్ని, చట్టాన్ని అంతగా గౌరవించే మీరు, చట్టాన్ని ధిక్కరించే కొడుకునైనా కోర్టు కీడ్చే గలిగిన మీరు రౌడీమూకతో పాటు పోలీసులు మీ కుమారుడ్ని అరెస్ట్‌చేస్తే ఎందుకు విడిపించారో... అని... సందేహం!" అన్నాడు అందరికీ వినిపించేలా.

కోర్టుహాలంతా విరగబడి నవ్వి కొంచెం వెంటనే సర్దుకుంది.

పర్వతరావు కోపంతోనూ, అయోమయంగానూ చూడాల్సివచ్చింది.

"కొడుకుని పోలీసులరెస్ట్ చేశారంటే ఏ తండ్రికైనా ముందు అనురాగం, ఆత్రం పెల్లుబికి వస్తాయి. నేనూ తండ్రినే మా వాడు అరెస్టయ్యాడని తెలీగానే, నా కొడుకు ఎలాంటి అనుచితకార్యమూ చేసివుండడన్న నమ్మకంతో విడిపించుకు వచ్చాను. తర్వాత కదా తెలిసింది వాడు నా కడుపున చెడబుట్టాడనీ..." ఎంతో అవమానం ఫీలవుతూన్నట్లు తలదించాడు.

"అతనంత కానిపనేం చేశాడని మీరంతగా అపనిందని భావిస్తున్నారు?"

"ఇంకా ఏం చేయాలి? నా కీర్తికి కళంకంగా ఆ సావిత్రికొంపలో దూరాడు. అది వాడికి మందుపెట్టి నా మీదకే ఉసి

కొల్పింది...."

"అబద్ధం! అంతా అబద్ధం. యువరానర్ అతను నాకు తండ్రికావచ్చు... పెద్ద మనిషి కావచ్చు! కానీ పెద్ద మనసున్న మనిషి మాత్రం కాదు... కోమలాదేవి లాంటి సభ్యస్త్రీని మాటిమాటికీ మీ సమక్షంలో అవమానిస్తూ మాట్లాడుతున్నాడు. అమాయకురాలైన ఆవిడ కూతుర్ని బజారుపిల్లలా చేసి వక్రీకరిస్తున్నాడు ఇదిగో ఈ వివరాలు చూడండి యువరానర్! నే నెందుకు చట్టాన్ని నా చేతుల్లోకి తీసుకోవలసివచ్చిందో తెలుస్తుంది" అంటూ రామచంద్రద్వారా ఓ కవర్ అందించాడు న్యాయమూర్తికి సురేందర్.

న్యాయమూర్తి కవరులోని కాగితాలూ తదితరం బయటికి తీసి ఒక్కొక్కటీ పరిశీలనగా చూసి మరునాటికి వాయిదా వేశాడు కోర్టుని.

* * *

చీటింగ్, బ్లాక్ మెయిలింగ్, పలుకుబడి దుర్వినియోగం, అమాయకులను జైలుపాలుచేయటం అనే నేరాలకుగాను కింగ్ మేకర్ పర్వతరావు కారాగార శిక్షకు గురైనాడు' అన్న వార్త తాటికాయలంత అక్షరాలతో ప్రముఖ దినపత్రికలన్నింటా వచ్చేసరికి రాజకీయవర్గాలలో విపరీతంగా సంచలనం పుట్టుకువచ్చింది.

న్యాయమూర్తి పర్వతరావును హైకోర్టులో అర్జీ దఖలుపరచుకునే అవకాశం ఇచ్చాడేగానీ బెయిల్ మీద విడుదలయ్యేందుకు అనుమతించలేదు.

సురేందర్‌ను మందలిస్తూ, న్యాయం కల్పించడంకోసం కన్నతండ్రినే ఎదిరించిన ధృక్పథాన్ని అభినందిస్తూ విడుదల చేశారు.

ఫోన్లమీద ఫోన్లు వచ్చాయి

బెదిరింపులతోనూ వచ్చాయి. కానీ న్యాయమూర్తి జడవనే లేదు.

పరిపాలనా రంగంలో ప్రముఖులైన రాజకీయనాయకుల నుండి ఘాటుగా వచ్చాయి రికమెండేషన్లు 'ఒక్కసారిచ్చిన తీర్పు, పత్రికల్లో ప్రపంచానికంతా తెలిసిన శిక్ష మార్చే ప్రసక్తేలేద'ని నిష్కర్షగా జవాబిచ్చాడు న్యాయమూర్తి.

"హైకోర్టులో నీ తీర్పు కొంటరయితే ఏం చేస్తావు?" అని సవాలు చేశారు.

"ఆ కోర్టులు ధర్మం తప్పినా, నా తీర్పు న్యాయం తప్పదు" అని సమాధానమిచ్చాడు.

రాజకీయాలు బలీయంగా పనిచేశాయి.

పర్వతరావు హైకోర్టులో నెగ్గాడు.

గర్వంగా సురేందర్ వైపూ రామచంద్ర వైపూ చూచాడు. లాయర్ రామచంద్ర బాధతో, అవమానంతో తలవాల్చుకుని బయలుదేరాడు, సురేందర్ విర్లక్ష్యంగా అసహ్యంగా తండ్రి వైపు చూచి చీత్కరించి ముందుకుపోయాడు.

కోమలాదేవి ఇంటిముందు ఆ రాత్రి జరిగిన వికార వికృత వీధిభాగవతం సభ్యులైన వాళ్ళెవరూ చూడలేక తలుపులు

మూసుకున్నారు. కొందరు స్టేషన్‌కు ఫోన్ చేసినా జవాబు చెప్పినవారెవరూ లేకుండాపోయారు.

ఆ రాత్రి దుర్ముహూర్తంగా సాగిపోయిందెలాగో.

మరునాడే నగరమంతా తీవ్ర అలజడితో అల్లకల్లోలంతో అట్టుడికినట్లు ఉడికిపోయింది.

ఎవరినోటా "పర్వతరావు హత్య... హత్య" అన్నమాటే

"సురేందరే చంపాడా? కొడుకే? కన్నతండ్రినే!" అనే అందరి ఆశ్చర్యమూనూ.

పర్వతరావు శవం పోస్టుమార్టం తర్వాత ఘనంగా ఊరేగింపుతో శ్మశాన వాటికకు బయలుదేరింది. వేలమంది ప్రజాసేవకులూ, ప్రతినిధులూ రకరకాల రాజకీయనాయకులూ అతని అంతిమ యాత్రలో పాల్గొనేందుకు బహుదూరాల నుండీ వచ్చారు.

వెంటనే సంతాపసభ ఏర్పాటుచేశారు.

పర్వతరావు సేవలనీ, రాజనీతినీ ఆకాశమెత్తున ప్రశంసించారు.

సురేందర్ని 'వీడేం కొడుకండీ! కటిక కసాయి హంతకుడు' అంటూ తీవ్రంగా అభిశంసించారు.

ఆంధ్రప్రదేశ్‌లో జైళ్ళ రుచియేమో చవిచూచిన సురేందర్ మూతిముక్కూ మొహమూ వాచి కోర్టులో బోనులో నిలబడ్డాడు.

కేసు విచారణకు ఓ వారంరోజుల ముందే కొత్త న్యాయమూర్తి వచ్చాడు.

"ఇక వీడిపని గోవిందే" అని సురేందర్ గురించి జనమంతా వాపోయారు.

కసిదీరా తిట్టవచ్చు వీణ్ణి అన్నంత తీవ్రంగా ప్రాసిక్యూటర్ ముద్దాయిమీద ప్రశ్నలవర్షం కురిపించాడు.

సురేందర్ ఏ ప్రశ్నకూ జవాబివ్వనే లేదు. అన్నిటికీ ఒకే సమాధానంగా "హంతకుడైన పర్వతరావుని నేనే హత్యచేశాను. ఇక విచారణ అనవసరం" అనే చెప్పాడు.

పర్వతరావు హంతకుడని సురేందర్ అనటం అన్నివర్గాలనీ ఆశ్చర్యపరిచింది. పర్వతరావుతో పనులు నెరవేర్చుకున్నవారు అసహ్యించుకున్నారు సురేందర్ని. కుటిలరాజకీయాల్లో ఆరితేరిన పర్వతరావు పద్ధతి తెలిసినవారు నిజమేనేమోనని అనుమానించారు.

"నీ కన్నతండ్రి పర్వతరావు హంతకుడని నీవెలా చెప్పగలుగుతున్నావు? తండ్రినే హంతకుడని దూషించేందుకు నీకు తెలివి లేదూ?" న్యాయమూర్తి దండిస్తూ ప్రశ్నించాడు.

"అతడు నా కన్నతండ్రి కాదు కనుక" అన్నాడు నిర్లక్ష్యంగా సురేందర్.

అదిరిపోయారు కోర్టుహాలోని సభ్యులంతా.

గుసగుసలతో గుసగుసలాడింది కోర్టు

అంతా.

'ఆడరాడర్ 'అన్నాడు న్యాయమూర్తి. అతని ముఖంలోనూ విస్మయం కనిపిస్తూనే వుంది.

"ఊ!! నీ కన్నతండ్రి కానంత మాత్రాన, అతను నిన్నింతవాణ్ణి చేసినా దన్న కృతజ్ఞతలేకుండా హంతకుడు ముద్రవేస్తున్నావెందుకు?"

"నా కన్నతండ్రిని హత్యచేశాడు కనుక!"

జనమంతా దిగ్భ్రాంతిచెందారు సురేందర్ కథ జీవితమా లేక ఇంద్రజాల ప్రదర్శనమా అని అర్థంకాక తికమక పడిపోసాగారు.

వెంటనే ప్రాసిక్యూటర్ లేచాడు

"నోట్ ద పాయింట్ యువరానర్. పర్వతరావు తన తండ్రిని హత్యచేశా దన్న కసితోనే పర్వతరావువద్ద అనాధగా చేరి అతనిచేత కొడుకుగా పెంచబడుతూనే ద్వేషాన్ని పెంచుకొని ప్రతీకారంగా హత్యచేశాడు. ముద్దాయే స్వయంగా నేరాన్ని అంగీకరిస్తున్నాడు కనుక తగిన శిక్ష విధించాల్సిందిగా కోర్టువారిని ప్రార్థిస్తున్నాను" అంటూ కూర్చున్నాడు

న్యాయమూర్తి ముద్దాయి నేరాన్ని నిర్ధారిస్తూ, "సాక్ష్యాధారాలే కాక ముద్దాయి నేరాన్ని స్వయంగా అంగీకరిస్తున్నందువల్ల, హత్య క్రూరమూ, దారుణమూ అయినా ముద్దాయి తనకు తాను లొంగిపోవడం, నేరం ఒప్పుకోవడం కారణాయిగా ఐ.పి.సి. 299వ సెక్షన్ ప్రకారం యావజ్జీవ కారాగార..." అంటూండగానే

"ఆగండి యువరానర్! నిర్దోషికి శిక్ష విధించి మీ కలాన్ని కలుషితం చేయకండి" అంటూ విమల, తనతల్లి కోమలాదేవితో కోర్టులో ప్రవేశించింది.

జనంలో ఆసక్తి మరీ పెరిగిపోయింది.

"అ...మ్మా! నువ్వా!" అంటూన్న సురేందర్ ముఖంలో విషాదఛాయలు కమ్ముకున్నాయి.


ప్రశ్నార్థకంగా న్యాయమూర్తి తన కలాన్ని నిలిపి వారివైపు చూచాడు.

"ప్రాసిక్యూటర్‌గారూ! వారిని విచారించండి" అని ఆదేశించాడు.

కోమలాదేవి బోనులో నిలబడింది. ప్రమాణం చేసింది.

"యువరానర్! పర్వతరావుగారూ, నేనూ కాలేజీ చదివేరోజుల్లో పరస్పరం ప్రేమించుకున్నాం. అన్ని కట్టుబాట్లూ కాదని వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నాం. కానీ... పర్వతరావు స్త్రీలోలుడే తప్ప, ప్రేమికుడు కాదని నాకు తెలిసింది. అతని నిజస్వరూపం తెలిశాక అతన్ని తిరస్కరించాను. పెద్దలు నిశ్చయించిన వరుణ్ణే వివాహం చేసుకుని గుట్టుగా ఈ నగరంలో ఓ మూల సంసారంచేస్తూన్న నా పాలిట యముడిలా పర్వతరావు ఇక్కడే

యువ




దిగబడ్డాడు. మావారు పనిచేస్తున్న ఫ్యాక్టరీలో భాగస్వామిగా కూడా చోటు చేసుకున్నాడు." అంటూ చెప్పుకొని పోసాగింది.

"మీ భర్త పేరు?" న్యాయమూర్తి ప్రశ్నించాడు.

"జనార్దనరావు. ఫ్యాక్టరీ మేనేజర్‌గా ఉండేవారు. పర్వతరావు గురించి మావారు నాతో ప్రసంగవశాత్తూ చెప్పినప్పుడే నేనేదో కీడు శంకించాను. అప్పటికి సురేందర్ ఏణ్నర్ధం పసివాడు. నేను మళ్ళీ గర్భవతిగా ఉన్నాను. ఆ నీచుడి కళ్ళు నామీద పడ్డాయి. ఒకరాత్రి సినిమా నుంచి రిక్షాలో వస్తూన్న మమ్మల్ని ఓ కారు డేషిచ్చింది. రిక్షావాడూ, నేనూ పసిపిల్లాడితో కూడా రోడ్డుకివతల పడిపోయాము. మావారు...రోడ్డుమీదే పడిపోయాడు. కారతని మీదుగానే వెళ్ళిపోయింది. ఆ కారెవరిదో, ఎవరు అంత నిర్దాక్షిణ్యంగా తోలారో నాకు తెలుసు" అంది గొంతు బొంగురుపోతుంటే, కళ్ళంబడి నీళ్ళు కారుతుంటే.

"ఎవరతను? కారెవరిది?"

"పర్వతరావుదే కారు. నడిపిందీ అతనే... ఈ నిజం లోకానికి తెలీదు. తెలిపినా నమ్మరు. అప్పటికే పర్వతరావు గ్రేట్ కింగ్‌మేకర్. చట్టం అతనిచేత కీలుబొమ్మ. నేనో అబలని. అసహాయురాలిని."

"పోలీసు దర్యాప్తు జరగలేదా?"

"జరిగింది... పర్వతరావు క్రూర హృదయం తెలుసు కనుక నా పిల్లవాడ్ని కాపాడుకోవాలని, నాకేమీ తెలియదనీ, నేనేమీ చూడలేదని పోలీసులకి చెప్ప

టంతో కేసు మాఫయింది."

"మరి సురేందర్ పర్వతరావు దగ్గర ఎలా చేరాడు?"

"మరునాడు పర్వతరావే అందరి ఎదుట నన్ను ఓదార్చాడు. జాలి కురిపించాడు. కర్మకాండలన్నీ తానే జరిపించి ధర్మదాత బిరుదు సంపాదించుకున్నాడు. సురేందర్ని తన కొడుకుగా పెంచుకుంటానని తీసుకుపోయాడు వాణ్ణి అడ్డంపెట్టుకుని నన్ను తనదాన్ని చేసుకోవాలనుకున్నాడు. కానీ అతని ఆటలు సాగలేదు. పదిమందిలో మాట పోతుందన్న భయంతో సురేందర్ని పెంచక తప్పలేదు. మావారి ఇన్సూరెన్సు డబ్బు సేవింగ్సు మొత్తమూ, చారిటీగా వచ్చిన డబ్బు అన్నిటితో నేను స్వయానా నిలదొక్కుకున్నాను. విమల పుట్టాక దాని పెంపకంలో సురేందర్ని మరచిపోక పోయినా వెనకటి బెంగను మాత్రం వదిలివేయగలిగాను. అంతేకాదు, సురేందర్ పర్వతరావింట పెరిగినా వాడి నాన్నగారి లక్షణాలతోనే పెరగటం నా కళ్ళారా చూస్తూనే వున్నాను కనుక నేను వాడి గురించి చింతించవలసిన అగత్యం లేకపోయింది."

"మరి సురేందర్కి మీరు కన్నతల్లి అనీ, పర్వతరావు తన స్వంత తండ్రి కాదనీ అతని కెలా తెలిసింది?"

"పర్వతరావు ధనమదం, పలుకుబడి మకురుతో కన్నూమిన్నూ కానని పశువై పోయాడు. వాడి పాపిష్టికళ్ళు విమలమీద పడ్డాయి. నేను ఇల్లు మారి సభ్యులుండే వీధిలో చేరాను. అల్లరిమూకలతో నా యింటిముందు అల్లరి చేయించసాగాడు. అనుకోకుండా సురేందర్ ఆ దారిన రావటమూ...ఆ తర్వాత సంగతి మీకు తెలుసు. విమలను చూసిన క్షణంలో సురేందర్లో అనుకోకుండానే తన పోలిక ఉండడం, సోదరభావం కల్గటం మా యింటికిరావడం జరిగింది. నేనూ, విమల సమాజంలో గౌరవంగా ఉండాలనుకున్నా క్షేమంగా ఉండలన్నా నిజాలు బైటపెట్టక తప్పదని సురేందర్కు అన్ని విషయాలు నేనే చెప్పాను యువరానర్!"


"యువరానర్ నోట్ ద పాయింట్" అంటూ ప్రాసిక్యూటర్ అసంగతంగా అన్నాడు.

"వాట్ పాయింట్?"

"తన తల్లి కోమలాదేవి చెప్పిన విషయాలు సురేందర్ని ఆవేశపరిచాయి. పగ, ద్వేషం, ప్రతీకారం అంటూ పర్వతరావుని హత్యచేశాడు. అంతే!" అన్నాడు సగర్వంగా

కోర్టుహాలు నవ్వులతో నిండిపోయింది అర్థంకాక అయోమయంగా అందరివైపూ చూచాడు ప్రాసిక్యూటర్.

"మిస్టర్ ప్రాసిక్యూటర్! ముద్దాయే ఒప్పుకున్నాడుగా... మరింకా బలమైన ఆధారం దొరికిందనా మీరలా అంటున్నారు? వాట్స్ ద యూజ్?" అంటూ



న్యాయమూర్తి చిరునవ్వు నవ్వాడు.

ప్రాసిక్యూటర్ చిన్నబుచ్చుకున్నాడు.

"మిస్టర్ ప్రాసిక్యూటర్! ముద్దాయి నేరం చేయలేదని కోమలా దేవి కూతురు విమల అన్నది - గుర్తుంచుకున్నారా?"

"తన అన్నయ్యకి పడే కఠినశిక్షను విని ఆవిడ మమకారంతో అలా అనుండవచ్చు యువరానర్!"

"నో...దటీజ్ రాంగ్ యువరానర్" కోమలా దేవి ఆవేశంగా అరిచింది.

"దెన్ వాటీజ్ ద ట్రూత్?"

"పర్వతరావుని నేనే హత్యచేశాను.

న్యాయాన్ని తన ధనంతో కొని మదంతో విర్రవీగిన ఆ నీచుడు ఆ రాత్రే విమల శీలాన్ని బలిగొనబోయాడు. నేనే విమలని పిలుచుకొని అతని భవంతికి వస్తానని నచ్చచెప్పి పంపాను. నేనొక్కత్తినే వెళ్ళాను. కుతికలదాకా తాగిన మత్తులో ఎవరేమీ కనుక్కోలేని స్థితిలో నాపై పడిన పర్వతరావుని కసిదీరా పొడిచాను. చిమ్మిన రక్తంతో తడిచిన ఆనాటి నా ఉడుపులూ, మీది శాలువా ఇవిగో చూడండి" అంటూ ఓ సంచీ అందించింది.

అందరూ విస్మయపోయారు

"యువరానర్! భవంతిలోనుండి నేను బైటికి పరుగున వెళ్ళిపోయాను. లోనికెవరో రావటం నేను చూచాను కానీ నా తత్తరలో ఎవరినీ నిగాగా చూచేస్థితిలో లేక గబగబా వెళ్ళిపోయాను ఆ వ్యక్తిమాత్రం నేనెవరో గుర్తించినట్లుంది."

"ఎవరా వ్యక్తి?"

కోమలాదేవి నవ్వింది విరక్తిగా, ఆనందంగా.

"కన్నతల్లి హంతకి అన్న నింద రారాదని నేరం తనపై వేసుకున్న కొడుకే యువరానర్! సురేందర్. అతనే హత్యచేశాడనేందుకు ఆధారం కేవలం అతను శవందగ్గర నిలిచి వుండటం... అతనే పోలీసులకి ఫోన్ చేయటం, బాకు పిడిమీద అతని వేలిముద్ర ఉండటం అంతేనా? మరి నెత్తుటి అడుగులెవరివో, బాకు బం ఎక్కడ పడిందో, నెత్తురు చిమ్మిన వస్త్రాలేవో విచారించారా యువరానర్?"

న్యాయమూర్తి ఒక్కక్షణం మౌనంగా ప్రాసిక్యూటర్ వైపూ, పోలీసాఫీసర్ల వైపూ చూచాడు.

వారు తలలు దించారు.

సురేందర్ వైపు చూచాడు. అతడు నిశ్చలంగా కన్నీళ్ళతో అతనివైపే చూస్తున్నాడు. కోమలాదేవి కరుగుతున్న మంచుశిఖరంలా నిలబడుంది.

"ఐ.పి.సి. 302 సెక్షన్ ప్రకారం కోమలాదేవినే ముద్దాయిగా ధ్రువీకరిస్తూ పదేళ్ళకారాగారవాస శిక్ష విధించడమైనది! సురేందర్‌ను నిర్దోషిగా భావించి విడుదల చేయడమైనది" అంటూ తీర్పు ప్రకటించి ఛాంబర్‌లోకి వెళ్ళిపోయాడు.

విమల, సురేందర్ కోమలాదేవి ఒళ్ళో ఒదిగి విలపించారు.